## అనగనగా... ఒక కథ

# పుష్కర మాత

పుష్కరాల్లో డూటీకెళ్లాలి!!

రాముకి పోలీస్ డ్రెస్ తీసేసి పురోహితుడి వేషంలో వెళ్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఉంది. సార్ చెప్పినప్పట్నుంచీ ఎన్ని సార్లు అనుకున్నాడో ఆ మాట రాము.

పుటక బ్రాహ్మణ పుటక! పుష్కర స్నానం సంకల్పం చేయించడం పుష్కరఘాట్‌లో తర్పణాలు చేయించడం ఆ మంత్రాలూ... అతనికి తెలుసు. అవన్నీ వినియోగించుకోవడం వల్ల బోల్డు డబ్బులు సంపాదించచ్చు. యూనిఫాం వదిలేయాలని నెల్లాళ్ల నుంచీ డ్రీమ్ వేసుకుంటున్న రాముకి సెలవు మంజూరు అవ్వలేదు. డ్యూటీ పుష్కర్‌ఘాట్‌లోనే పడింది గానీ తన అభిమతానికి అనుసరించి కాదు.

పోలీసు యూనిఫారంలోనే ప్రయాణానికి సిద్ధం అయ్యాడు. వెళ్లే ముందు తల్లి- "ఒరే నాన్నా.. ఎక్కడైనా టైము దొరికితే నాన్నకి తర్పణం ఇవ్వరా" అంది.

ఆ మాటలు వింటున్న రాముకి కళ్లంట గిర్రున నీళ్లు తిరిగాయి. నాన్న..శ్యామ శాస్త్రి తననో ఉద్దండ పండిత పురోహితుణ్ని చేద్దామనుకున్నాడు గానీ... ఆయన కను మూయగానే ఖర్చులు అవసరమై పోలీసు ఉద్యోగం దొరకడం సులభమై బ్రతకడానికి దారి దొరికింది.

రాము రెండు మూడు ఇస్త్రీ జతల యూనిఫారాల్తో పుష్కరాల ప్రదేశానికి డ్యూటీ మీద బైల్దేరాడు. రాత్రింబవళ్లు.. ఇక్కడా అక్కడా అని లేకుండా కొంతసేపు ఘాట్ లోనూ, ఇంకొంత సేపు సత్రవుల్లోనూ, మరికొంతసేపు యాత్రికుల రవాణాలోనూ హైరానా పడుతున్నాడు.

ఒక్కరోజు యూనిఫాం తీసేసి నాన్నకి తర్పణం చేయాలి అన్న కోరిక... తల్లి అభ్యర్థన మనస్సులో దొలుస్తూనే ఉంది.

గంటసేపు కూడా తీరిక చిక్కట్లేదు.

సచేలంగా పుష్కరస్నానం చేద్దామని ఉబలాటపడ్డా.. డ్యూటీ నుంచి తప్పుకునే వెసులుబాటు చిక్కట్లేదు. పండు ముసలివారి నుంచి పది నెలల పిల్లలదాకా ఎక్కడెక్కణ్నుంచో యాత్రికులు పుష్కరస్నానం కోసం వచ్చిన వాళ్లలో ఉన్నారు.

భాష తెలియని వాళ్లు ఆ ప్రదేశం తెలియనివాళ్లూ అసంఖ్యాకంగా ఉన్నారు. అలాంటి వాళ్లకి సాయపడటం కూడా పుణ్యమే అనుకుంటున్నాడు.

వచ్చిన యాత్రికుల తీర్థస్నానం పూర్తవ్వగానే వెంటనే పంపించెయ్యకపోతే రద్దీ పెరిగిపోతుంది. రేపు శని ఆదివారాలు మరింత మంది జనం వచ్చే అవకాశం ఉందని ఆ ఏరియా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అర్థరాత్రి మీటింగ్‌లో హెచ్చరింపులు, హెచ్చు జాగ్రత్త చర్యలూ చెప్పాడు.

స్నానాల కోసం అందరూ భక్తులే వస్తారనుకోడానికి వీల్లేదు.

తడిసిన ఆడాళ్లని చూపుల్తో తడిమేసే పోకిరీగాళ్లు, సందట్లో సడేమియా అన్నట్లు హస్తలాఘవం గల జేబుదొంగలూ..

ఇదే ఆఖరి పుష్కరం అనే ధ్యాసతో ఉన్న పెద్దవాళ్లు... పచ్చి బాలింతలూ, వాళ్ల చేతుల్లో పసిగుడ్డులూ, అందర్నీ కనిపెట్టుకోవటానికి వందలాది పోలీసులూ.. ఘాట్‌లన్నీ పులకించి పోతున్నాయి జనపారవశ్యంతో.

'అమ్మని కూడా తీసుకురావల్సింది' పది రోజుల్లో పదిసార్లయినా అనుకున్నాడు.

ముసలి తల్లిదండ్రుల్ని వీల్‌చైర్లో స్నానాల రేవుకి తీసుకొస్తున్న కొడుకుల్ని చూసినప్పుడు మరీ ఫీలవుతున్నాడు.

వెళ్లేప్పుడు ఓ సీసా నిండా నీళ్లు పట్టి అమ్మకి ఇంట్లోనైనా పుష్కర తీర్థ పుణ్య స్నానం చేయించాలి.

ఈలోగా ఏదో గలాభా వినిపించింది. పరుగెత్తుకుంటూ అటువైపు వెళ్లాడు రాము.

వాళ్లిద్దరూ మొగుడూ పెళ్లాలే - దెబ్బలాట చూస్తే అర్థమయిపోయింది.

ఆలుమగల పోరాటంలో అందరూ తలెట్టరు గానీ పోలీసు వేషంలో ఏ గొడవలోనైనా కలిగించుకోవచ్చు.

"క్యా. హువా"

"కుఛ్ భీ నహీ" అన్నాడా మొగుడు.

"ఏం లేదంటావేటీ.. చెప్పు.. మళ్లీ ఆ పోలీసుగారు నిన్నే నన్నే టేషనుకీడ్చుకెళ్తారు."

"నువ్ నోర్మూయ్.. ఏం లేదు సార్.. దీనికి బుర్ర తక్కువ నోరెక్కువ" అని పక్కకు పిల్చి గుట్టుగా చెప్పాడు.

వాళ్ల కథ అర్థమయ్యేంత వరకు పెళ్లాం బుసలు కొడుతూ దూరంగానే ఉంది.

ఆయనగారు వాళ్ల ముసలి తండ్రిని తీసుకొచ్చి పుష్కర స్నానం చేయించాలనుకున్నాడట.

ఆవిడగారు 'ససేమిరా' మళ్లీ ఊరెళ్లి ఆయన్ని తీసుకురావడానికి ఒప్పుకోవడం లేదట.

రాము నవ్వుకున్నాడు. తన మనస్సులో తల్లి. అతని మనస్సులో తండ్రి.


తన భార్య కూడా తల్లిని తీసుకొస్తానంటే ఇలాగే గొడవ పెట్టేదా? వరలక్ష్మి అలాటిది కాదు. పాపం మంచి పిల్ల... పక్షవాతం వచ్చి మంచంలో పడ్డ తన తల్లిని కన్నతల్లిలా చూసుకుంటుంది.

* * *

ఆ రాత్రి గెస్ట్‌హౌసొకెళ్లి కాసేపు నడుం వాల్చుదామనుకునేంతలో... గెస్టుహౌస్ ముందు ఒక ముదుసలి కనిపించింది.

"ఏమమ్మా.. ఏం చేస్తున్నావిక్కడ" పోలీసు దర్పం లేకుండా అడగడం చేతకాలేదు రాముకి.

ఇదే ఆఖరి పుష్కరం అనే ధ్యాసతో ఉన్న పెద్దవాళ్లు... పచ్చి బాలింతలూ, వాళ్ల చేతుల్లో పసిగుడ్డులూ, అందర్నీ కనిపెట్టుకోవటానికి వందలాది పోలీసులూ.. ఘాట్‌లన్నీ పులకించి పోతున్నాయి జనపారవశ్యంతో.



"చలేస్తోంది బాబూ.. ఈ పంచన కూచుందామని..." వయసు వణుకు, చలి వణుకు చెవులకు సోకి జాలేసింది రాముకి.

"ఏ సత్రంలో దిగావ్" పోలీసు దర్పం తగ్గించుకుని అడిగాడు రాము.

"మా అబ్బాయి ఏదైనా సత్రంలో గది చూసొస్తానని వెళ్లాడు. ఇంకా రాలేదు"

"ఎంతసేపయింది వెళ్లి"

"పొద్దున్నే స్నానం చేశాం. సూర్యాస్తమయ స్నానం కూడా చేద్దామమ్మా అన్నాడు. వద్దురా నాన్న ఇంటికెళ్లిపోదామన్నాను. అలా కాదమ్మా... రెండూ చేస్తేనే పుణ్యం అన్నాడు. నన్నిక్కడే నిలబడమన్నాడు. పొద్దుననగా వెళ్లాడు. కాదు.. వెళ్లిపోయాడు... నన్నొదిలి పెట్టి వెళ్లిపోయాడు."

"అంటే.. ఏవన్నా ప్రమాదం జరిగిందా పెద్దమ్మా"

"వాడికే ప్రమాదం జరగలేదు. నాకు తెలుసు వాడు ఈ జనం మధ్యలో నన్నొదిలి వెళ్లిపోవాలనే ఉపాయం చేసి నన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకొచ్చాడు" ఏడుపు మధ్యలో తన కథ చెప్పింది.

రాము గుండె ద్రవించిపోయింది.

"వాడు మంచివాడే బాబూ. వాడి పరిస్థితులు అనుకూలించలేదు. పెళ్లికావల్సిన ముగ్గురాడ పిల్లలు. చదువుకుంటున్న ఇద్దరు కొడుకులూ భార్య... నేనూ... ఆ ఒంటెద్దు... బండిని ఎంతకాలం లాగుతుంది. నా బరువునిలా దింపుకున్నాడు"

రాము దుఃఖాన్ని కంట్రోలు చేసుకుని... కోపంగా "నీ కొడుకు అడ్రస్ చెప్పు.. వాడి దగ్గరికి నిన్ను తీసుకెళ్లి.. నాలుగు తన్ని బెదిరిస్తే దార్లోకొస్తాడు"

"ఎడ్రస్సు చెప్పను!! వద్దనుకున్నప్పుడు కాళ్లకి అడ్డం పడ్డం నా అభిమతం గాదు. నదిలో నీళ్లున్నాయి. అలలు నన్ను దాచుకుంటాయి. వాడు కోరుకున్నది నేను కోరుకునేదీ తీరిపోతుంది"

"పెద్దమ్మా ఆగు. చావుని మనం కోరుకోకూడదు. జీవితాన్ని మనం ఆపలేం. నదిలో పడినవాళ్లు చేప నోట్లోంచి కూడా బైటకొస్తారని మనకి తెల్సున్న కథే. లేదా ఏ ఒడ్డుకో తేలి చావుబతుకుల మధ్య చచ్చే చావు చస్తూన్నవాళ్లూ ఎందరో ఉన్నారు. బతకడం అనేది అక్షరాలా నీ 'జన్మ' హక్కు"

"చూడు బాబూ.. పెద్దమ్మా అని ఆప్యాయంగా పిలిచావ్ కాబట్టి చెప్తున్నాను. నా బతుకు ఎవ్వరికీ అక్కర్లేదు. నాకు అంతకన్నా అవసరం లేదు"

రాముకి ఆవిడ బాధ అర్థమయింది.

అయినా ఆవిడ బాధకి ఆవిణ్ని వదిలేయాలనిపించలేదు.

రెండ్రోజులయ్యాక డ్యూటీ వదలి సొంత ఊరు వెళ్తున్నప్పుడు రాము ఆవిడని తీసుకుని ఇంటికెళ్లాడు.రాము ఎప్పుడూ పెద్దమ్మ కొడుకు అడ్రస్ అడగలేదు. ఆమె చెప్పనూ లేదు. పెద్దమ్మ తన తల్లికి అక్కలా, ఇంటికి పెద్ద దిక్కులా ఉంది.

*